


# 'అ ఆ' లు నేర్పిన గురుదేవులకి అక్షరాంజలి

ఆరి సీతారామయ్య

*"నువ్వు మాంసం తినకపోవటానికి కారణం మతసంబంధమైన నమ్మకాలా ?"*

*రెస్టారెంట్ కెళ్ళినప్పుడు అమెరికన్ మిత్రులు అడిగే ప్రశ్న ఇది.*

*నాకు ఓపిక ఉంటే అసలు సంగతి చెపుతాను. లేకపోతే, "అవును," అంటాను.*

*ఒక్కోసారి "అవును," మాటే సరిపోదు.*

"మరి మా ఆఫీసులో పనిచేసే పటేల్ బర్గర్లు తింటాడే, అతను హిందూ కాదా? లేక అతనూ నువ్వూ వేరే వేరే కాస్టా?"

ఈ ప్రశ్న మీదేశం గురించి నా క్కూడా కొద్దో గొప్పో తెలుసులే అని చెప్పటానికి వేసే ప్రశ్న. ఇక దీని ముగింపు గురించి రాయాలంటే అది ఇంకొక పెద్ద కథ అవుతుంది. ఓపిక ఉంటే అసలు సంగతి చెపుతానన్నాను కదా. దాని విషయం చెపుతాను.

మా స్వగ్రామం తిమ్మనపాలెం. ప్రకాశం జిల్లాలో ఒంగోలు నుంచి గుంటూరు పోయే రహదారి మీద ఒంగోలుకు పదమూడు మైళ్ళు ఉత్తరంగా ఉంటుంది. నేను చదువుకున్న రోజుల్లో అది చిన్న గ్రామం. బహుశా అంతా కలిసి వంద కుటుంబాలుండేవేమో. ఊళ్ళో ఎక్కువ భాగం రహదారికి తూర్పు వైపు ఉండేది. ఊళ్ళో ఉన్న ఒకే ఒక్క ప్రాథమిక పాఠశాల రోడ్డుకు పడమటి వైపున ఉన్న ఇళ్ళ వెనక ఉండేది. తూర్పు వైపు ఇళ్ళలో పిల్లలు బడికెళ్ళాలంటే రోడ్డు దాటి వెళ్ళాలి. పెద్ద వాళ్ళకు అదొక భయం. రోడ్డు మీద ఎప్పుడూ లారీలు చాలా వేగంగా పోతుండేవి.

బడికి వెళ్ళడం, సాయంత్రం బడివెనక చింత తోపులో చెడుగుడూ, బిళ్ళంగోడూ, ఉప్పాటా ఆడుకోవటం - ఇవి తప్ప పిల్లలకు మరో వ్యాపకం ఉండేది కాదు. బడి రెండు నిట్టాళ్ళ పూరి గుడిసె. దాని ముందు నీళ్ళబావి. చాలా ఖాళీస్థలం

ఉండేది. అందులో రకరకాల పూల మొక్కలుండేవి. బడి పక్కనే తమ్మవరపు వెంకటరమణయ్య పంతులుగారి ఇల్లు. అసలు బడి ఆయన స్థలమేనని, దాన్ని స్కూలుగా మార్చి పిల్లలకు చదువుచెపుతున్నాడనీ చెప్పుకునేవారు.

ఉదయం ప్రార్ధనతో మొదలయ్యేది బడి. అందరం బడి ముందు వరసగా నుంచునే వాళ్ళం. తల్లీ నిన్ను దలంచి, శుక్లాంబరధరం పాడేవాళ్ళం. ఇంకా ఏమైనా పాడేవాళ్ళమేమో గుర్తులేదు. తర్వాత లోపలికెళ్ళటం ఎవరి స్థలంలో వాళ్ళు కూర్చునేవాళ్ళం. బల్లలూ కుర్చీలు ఉండేవి కాదు. ఒక్కో తరగతి వాళ్ళం ఒక గుంపుగా కూర్చునేవాళ్ళం. ఇక ఏం చదువుకున్నామో గుర్తులేదు. పలకల మీద అ,ఆ,లు నేర్చుకోవటం గుర్తుంది. గుణింతాలు నేర్చుకోవటం గుర్తుంది. మిగతా చదువు గురించి అంతగా గుర్తులేదు. కాకపోతే పద్యాలు చదవటం, అప్పచెప్పటం మాత్రం బాగా గుర్తుంది. సుమతీ శతకం, వేమన శతకం పద్యాలు  అప్పచెప్పేవాళ్ళం. రుక్మిణీ కళ్యాణం మొదటి నుంచి చివరిదాకా అప్పచెప్పాం. ఘనుడా భూసురుడేగెనో, నడుమ మార్గశ్రాంతుడై చిక్కెనో, విని కృష్ణుండది తప్పుగా దలచెనో - చదువుతుంటే రుక్మిణి కళ్ళముందే కనిపించేది. పాపం, అమ్మాయికి ఎంత కష్టం అనిపించేది. అలా అనిపించటానికి కారణం రమణయ్య పంతులుగారు ఈ పద్యాలగురించి వివరంగా చెప్పిన విధానం. ఆయన రుక్మిణీ కళ్యాణం గురించి పాఠం చెపుతుంటే, నోళ్ళు తెరుచుకుని వింటుండేవాళ్ళం పిల్లలం అందరం.

ఉన్న ఐదు తరగతులూ ఒకే గదిలో ఉండటం వల్ల పంతులుగారు ఈ వైపున ఉంటే ఆ వైపు పిల్లలు పెద్దగా మాట్లాడుకోవటం, "ఒరేయ్, అల్లరి చెయ్యకండ్రా," అంటూ పంతులుగారు ఆ వైపు వెళ్ళటం, ఇక ఈ వైపు పిల్లలు మాటల్లో పడటం - ఇలా పాపం అటూ ఇటూ తిరుగుతుండేవాడు పంతులుగారు. కానీ ఎప్పుడూ ఎవర్నీ తిట్టటం కొట్టటం నేను చూళ్ళేదు. మహా అయితే అల్లరి చెయ్యటం ఆపకపోతే అందరిచేతా గోడకుర్చీ వేయిస్తానని బెదిరించేవాడు.

సాయంత్రం బడి గంట కొట్టగానే, బడి ముందున్న మొక్కలకు నీళ్ళు పొయ్యటం మొదలయేది. బడి ముందే నీళ్ళ బావి ఉండేది. చేంతాడు - బక్కెట్‌తో నీళ్ళు తోడటం కొందరి బాధ్యత, నీళ్ళను కుండల్లో పొయ్యటం కొందరు, కుండలతో మొక్కలకు నీళ్ళు పొయ్యటం - మా బాధ్యతలను ఇలా పంచేవాడు పంతులుగారు. ఒక జట్టు అయింతర్వాత మరొక జట్టు పనిలోకి దిగేది. చేంతాడుతో నీళ్ళు తోడేటప్పుడు, బావి చుట్టూ నీళ్ళు పడి బురద బురదగా అయ్యేది. తాడు బురదలో పడితే జారిపోతూ నీళ్ళు తోడటం కష్టం అవుతుంది. అందువల్ల నీళ్ళు తోడేవాడికి పక్కగా నిలుచుని, తాడు బురదలో పడకుండా చుడుతూ పట్టుకోవటానికి ఒకడు కావాలి. మా జట్టులో ఆ పని నేను చేసేవాడిని. వీడు సోమరి అనేవాళ్ళు మా జట్టు వాళ్ళు.

నీళ్ళు పొయ్యటం అయింతర్వాత, ఎవరికి ఇష్టమైన ఆటలు వాళ్ళు ఆడుకునేవారు. నాకు ఆడపిల్లలతో గవ్వలాట ఆడటం బాగా ఇష్టంగా ఉండేది, చింత తోపులో చెడుగుడు, ఉప్పాట కూడా ఆడేవాళ్ళం.

బడి పక్కనే రమణయ్య పంతులుగారి ఇల్లుండేది. ఇంటి ముందు రెండు వైపులా అరుగులుండేవి. ఒక అరుగుమీద ఒక పక్కన పెద్ద చెక్కపెట్టె ఉండేది. దాన్లో చిందరవందరగా పడేసిన పుస్తకాలుండేవి. ఇష్టమొచ్చిన పుస్తకం ఎవరైనా తీసుకోవచ్చు. ఏం పుస్తకాలుండేవో గుర్తులేదుగాని, చందమామ, బాలమిత్ర మాత్రం గుర్తే.

రాత్రి భోజనాలయింతర్వాత ఊరి జనం రమణయ్య పంతులు గారి ఇంటికి చేరేవారు. ఆయన ఇంటి ముందు అరుగు మీద కూర్చుని భాగవతమో, రామాయణమో చదివి వినిపించి, అర్థం చెప్పేవాడు. ఓపిక ఉన్నంతసేపు కూర్చుని, నిద్రవచ్చిన వాళ్ళు లేచిపోతుండేవారు.

ఆ రోజుల్లో దసరా పండగ అంటే పిల్లలందరికీ బాగా హుషారుగా ఉండేది. ఏదో ఒక తరగతి పిల్లలను తీసుకుని పంతులుగారు ఊళ్ళోకి వెళ్ళేవారు. ఎవరి ఇంటికి వెళ్ళినా పంతులుగారిని చూడగానే సాదరంగా ఆహ్వానించి, మంచం వేసి, కూర్చోమనేవారు. పంతులుగారు కూర్చోగానే మేమందరం దసరా పాట పాడేవాళ్ళం. పాట అంతా గుర్తులేదుకాని, "అయ్యవారికి చాలు ఐదు వరహాలూ, పిల్లవారికి చాలు పప్పు బెల్లాలు, "మాత్రం గుర్తుంది. అడగటం ఐదు వరహాలే గాని, ఇవ్వటం మాత్రం ఒకటీ రెండు రూపాయలే. పిల్లలకు మాత్రం బెల్లమూ, కందిపప్పో శనగపప్పో పెట్టేవారు. అవి నములుతూ ఇంకొక ఇంటికి వెళ్ళేవాళ్ళం.

ఇప్పుడు ఎలా ఉందో తెలియదుగాని ఆ రోజుల్లో బడి అంటే అమెరికాలోలాగా ఉదయం వెళ్ళటం, మూడు గంటలకు ఇంటికి రావటం కాదు. ఉదయం వెళ్ళేవాళ్ళం, పదీ పదకొండు గంటలకో ఏమో ఇంటి కెళ్ళేవాళ్ళం. మళ్ళా రెండు మూడు గంటలప్పుడు బడికెళ్ళటం, సాయంత్రం ఇంటికి రావటం మధ్యాహ్నం అందరూ ఇంటికెళితే నేను మాత్రం చాలా సార్లు పంతులుగారింటి దగ్గరే ఉండేవాణ్ణి. పంతులుగారికి ఒక కొడుకుండేవాడు. అతనితో నాకు మంచి స్నేహం కుదిరింది. మధ్యాహ్నం పిల్లలందరూ ఇళ్ళకు వెళ్ళింతర్వాత పంతులుగారు ఇంట్లో చాలా సేపు పూజ చేసేవాడు. పూజ అయింతర్వాత ఆయనా, కొడుకూ భోజనం చేసేవారు. నేనుంటే నేను కూడా వాళ్ళతో తినేవాడిని.

నాలుగు సంవత్సరాలు నేను రమణయ్య పంతులుగారి బళ్ళో చదివాను. నన్ను మూడో తరగతి నుంచి అయిదో తరగతిలోకి మార్చాడాయన. అందువల్ల నాలుగు సంవత్సరాల్లో ఐదు తరగతులూ అయిపోయాయి. ఆ నాలుగేళ్ళలో చాలా సమయం నేను పంతులుగారి ఇంట్లోనే గడిపాను. ఆయన ఎప్పుడూ ఇలాంటి పదార్థాలు తినొచ్చు, అలాంటివి తినకూడదూ అని చెప్పలేదు. కాని వాళ్ళింట్లో వాళ్ళు వండుకుని తినే పదార్థాలే నాకూ అలవాటయ్యాయి. మా ఇంట్లో అమ్మ నాకు మాంసం అలవాటు చెయ్యాలని ప్రయత్నం చేసింది. కాని నేనే ఒప్పుకోలేదు. రమణయ్య పంతులుగారు అవి తినరు కాబట్టి అంతే. అంతకంటే పెద్ద కారణం ఏమీ లేదు.



అమెరికాలోని ప్రవాసాంధ్ర రచయితల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపుని పొందిన ఆరి సీతారామయ్య గారు, తక్కువగా వ్రాసినా ఉత్తమ ప్రమాణాలు గల కథలు వ్రాసారు. వీరి కథల్లోని సామాజిక స్పృహ, జీవన విలువల పట్ల స్పష్టమైన దృక్పథం.. కథకుడిగా వీరికి ప్రత్యేక గుర్తింపుని తెచ్చాయి.